నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, బుధవారం 2 అక్టోబర్ 2024 | KARIMNAGAR

## 'ప్రతిమ'లో ఉచిత రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ శిబిరం



ఉచిత రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 1: నగునూర్‌లోని ప్రతిమ వైద్య విజ్ఞాన సంస్థలో మంగళవారం ఉచిత రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ అవగాహన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ నెల 1 నుంచి 31 వరకు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయత్రం 4 వరకు జనరల్ సర్జరీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ ఆరుణ్ కఠారి ఆధ్వర్యంలో పరీక్షలు చేయనున్నారు. రొమ్ములో గడ్డలు, చనుమొనల నుంచి ద్రవాలు స్రవించడం, వెను తిరిగిన చనుమొనలు, ఎర్రగా కందినట్టుగా ఉండడం, రొమ్ములు గట్టిపడడం వంటి లక్షణాలు కలిగిన వారు తప్పకుండా పరీక్షలు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఇక్కడ, డాక్టర్ కన్సల్టేషన్, రొమ్ము పరీక్ష, రొమ్ము స్క్రీనింగ్, అల్ట్రా సౌండ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

## పూల జాతరకు వేళాయె

**నేడు ఎంగిలిపూల బతుకమ్మ**
**తొమ్మిది రోజుల పాటు ఊరూరా వేడుకలు**



ఆడబిడ్డలు ఆనందంగా జరుపుకొనే బతుకమ్మ పండుగ రానేవచ్చింది. నేడు ఎంగిలిపూలతో మొదలై, సద్దుల దాకా ఊరూరా అంబరాన్నంటనున్నది. తొమ్మిది రోజుల పాటు వాకిళ్లన్నీ పూదోటలుగా మారనుండగా, 'బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ సాగే ఆటాపాటలతో ఊరూవాడా హోరెత్తనున్నది. అత్తారింటి నుంచి పుట్టింటికి చేరే ఆడబిడ్డలు, యువతులు, చిన్నారుల ఆటాపాటలతో ప్రతి ఇల్లూ సందడిగా మారనున్నది.

**- కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 1**

# రైతులను నమ్మించి ముంచుతరా..?

### కొర్రీలు పెట్టకుండా అందరికీ రుణమాఫీ చేయాల్సిందే

- సర్కారు స్పందించేదాకా వదిలిపెట్టేది లేదు
- రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- పెద్దపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం



పెద్దపల్లి అదనపు కలెక్టర్ జెల్ల అరుణశ్రీకి వినతి పత్రం అందిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, పుట్ట మధూకర్, దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): 'ఎన్నికల ముందు కల్లిబొల్లి మాటలు చెప్పిన్రు. రైతులందరికీ ₹2లక్షల రుణమాఫీ చేస్తామని, రైతు భరోసా ఇస్తామని నమ్మించిన్రు. తీరా గెలిచాక ముంచుతరా..?' అని రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. కేవలం 33 నుంచి 40 శాతం మందికి మాఫీ చేసి అందరికీ చేశామని చేతులు దులుపుకుంటే ఊరుకునేది లేదని, ఎలాంటి ఆంక్షలు లేకుండా అందరికీ రుణమాఫీ చేయాల్సిందేనని, రైతు భరోసా డబ్బులు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రంగంపల్లి నుంచి కలెక్టరేట్ దాకా భారీ ర్యాలీ తీశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, పుట్ట మధూకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, బీఆర్ఎస్ నాయకులు గంట రాములు, దాసరి ఉష, రైతులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టి, కాంగ్రెస్ సర్కారు, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జల్ల అరుణశ్రీకి వినతి పత్రం అందజేశారు. ఆ తర్వాత కొప్పుల ఈశ్వర్ మాట్లాడారు. 'రేవంత్‌రెడ్డి ఇక మీ ఆటలు సాగవు. తొమ్మిది నెలల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలతో ప్రజలు భయపడుతున్నరు. రేవంత్‌రెడ్డి అస్తవ్యస్త పాలనపై జనం విసిగు చెంది తిరబడేందుకు సిద్ధమవుతున్నరు. ఇది అంతం కాదు, ఆరంభం' అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుల కోసం బీఆర్ఎస్ ఎప్పుడూ పోరాటం చేస్తుందని, ఎలాంటి ఆంక్షలు, కొర్రీలు లేకుండా రైతులందరికీ ₹2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉప్పు రాజ్‌కుమార్, తగరం శంకర్‌లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్, మార్కు లక్ష్మణ్, కాపరబోయిన భాస్కర్, బండారి శ్రీనివాస్ గౌడ్, కొయ్యడ సతీశ్, అత్తె చంద్రమౌళి, ఆకుల స్వామి వివేక్ పటేల్, రామారావు, నూనె కుమార్, పెంచాల శ్రీధర్, మేకల సంపత్, ఐరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆరెపల్లి కుమార్, మంథని లక్ష్మణ్, జంజర్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### రుణమాఫీ అయ్యే దాకా వదలం

ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ ₹2లక్షల రుణమాఫీ చేసే దాకా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలే ప్రసక్తే లేదు. ఈ యేడాది ఆగస్టు 15లోగా ₹2లక్షల రుణమాఫీ చేస్తామని పార్లమెంట్ ఎన్నికల్లో దేవుళ్ల మీద ప్రమాణం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, అక్టోబర్ నెల వచ్చినా అందరికీ మాఫీ చేయలే. ఏదో కొద్దిపాటి మందికి మాఫీ చేసి చేతులు దులుపుకుంటామంటే ఊరుకోం. పెట్టుకున్న గడువులోగా మాఫీ చేయనందుకు రేవంత్‌రెడ్డి రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి.

**- కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే (రామగుండం)**

### రైతుల గోస చూడు

కాంగ్రెస్ ప్రభుత్వామా కండ్లు తెరిచి రైతుల గోస చూడు. పిరికెడు మంది రైతులకు రుణమాఫీ చేసి గొప్పలు చెప్పుకోవద్దు. మంథని నియోజకవర్గానికి చెందిన చిట్టిటి రాజయ్య అనే రైతుకు ₹35వేలే మాఫీ కాలేదు. దానికి సమాధానం ఎవరు చెప్పాలి? చీమలు పెట్టిన పుట్టలో పాములు సొచ్చినట్లు, కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం తెస్తే రేవంత్ రెడ్డి సీఎం అయి ఢిల్లీకి కప్పం కడుతుండు. ఇకనైనా కప్పం కట్టడం ఆపి తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం ఆలోచించు.

**- పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్యే (మంథని)**

### పొట్టకొడితే ఊరుకోం

కాంగ్రెస్ అధికారం కోసం ఆచరణ సాధ్యంకాని 420 హామీలు ఇచ్చి, మోసం చేసింది. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి, తొమ్మిది నెలలైనా అతీగతీ లేదు. గత ప్రభుత్వ హయాంలో రైతు బంధు సకాలంలో పడుతుండె. ఏకకాలంలో ₹లక్షలోపు రుణమాఫీ కూడా అయితుండె. కానీ, రేవంత్ రెడ్డి సర్కారు మాత్రం వానకాలం పంటకు సంబంధించిన రైతు భరోసా ఇప్పటి వరకు ఇవ్వలె. ₹2 లక్షల రుణమాఫీ అందరికీ చేయలె. రైతుల పొట్టకొడితే ఊరుకోం. రుణమాఫీ చేసేదాకా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టం.

**-దాసరి మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే (పెద్దపల్లి)**

## కాంగ్రెస్ సర్కారును నమ్మొద్దు

**కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల**



మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, పక్కన బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

కథలాపూర్, అక్టోబర్ 1: అసత్యపు ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మవద్దని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సూచించారు. కథలాపూర్ మండలం పోసానిపేట శివారులో బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మండల నాయకులు మంగళవారం నిర్వహించిన వనభోజనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలనపై అవగాహన కరువైందని, అందుకే ప్రజలు నిరాశ నిస్పృహలో ఉన్నారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు కష్టపడి పనిచేయాలని, పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఇటీవలి కాలంలో బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టిస్తూ భయపెడుతున్నదని, ఇది మంచి పద్ధతి కాదని సూచించారు. కార్యకర్తలు భయపడవద్దని, భవిష్యత్తులో మంచి రోజులు వస్తాయని భరోసానిచ్చారు. ఇక్కడ మాజీ ఎంపీపీ జవ్వాజి రేవతి, నాయకులు గండ్ర కిరణ్‌రావు, బొడ్డు బాలు, దొప్పల జలేందర్, నల్ల గంగాధర్, పాలెపు రాజేశ్, బాల్క సంజీవ్, సోమ దేవేందర్‌రెడ్డి, చంద్రునాయక్, లింబాద్రి పాల్గొన్నారు.

## కులవృత్తులకు పెద్దపీట వేశాం

- అనేక పథకాలతో కేసీఆర్ అండగా నిలిచారు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కార్పొరేషన్, అక్టోబర్ 1: బీఆర్ఎస్ హయాంలో కులవృత్తులకు పెద్దపీట వేశామని, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టి అండగా నిలిచారని రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కిసాన్‌నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో నాయీ బ్రాహ్మణ యువ గళం ఫౌండేషన్ కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం గంగుల మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బీసీల అభ్యున్నతికి కేసీఆర్ బీసీ బంధు ప్రవేశపెట్టారని, నాయీ బ్రాహ్మణులు సొంతంగా క్షౌరశాలలు ఏర్పాటు చేసుకునేందుకు రూ.లక్ష ఉచితంగా అందించారని గుర్తు చేశారు. ఇంకా దళితుల అభ్యున్నతికి దళితబంధు తీసుకువచ్చారని చెప్పారు. ఆ పథకాలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసి, వారి బతుకులను మళ్లీ అంధకారంలోకి నెట్టిందని మండిపడ్డారు. వెనుకబడిన తరగతుల ప్రజలు అభివృద్ధి చెందాలంటే మళ్లీ పథకాలను కొనసాగించాల్సిందేనని డిమాండ్ చేశారు. బీసీలకు సంఖ్యాపరంగా రాజ్యాధికారం వస్తేనే బీసీల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. నాయీ బ్రాహ్మణులు యువగలం ఫౌండేషన్ పేరుతో నిర్వహించే కార్యక్రమాలు నాయీ బ్రాహ్మణులకు ఎంతో మేలు చేసే విధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్లు కుర్ర తిరుపతి, కంసాల శ్రీనివాస్, నాయకులు అశోక్, మహేశ్ పాల్గొన్నారు



కొత్త జయపాల్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న అభిమానులు

## పుట్టిన రోజు సామాజిక సేవ

కరీంనగర్ కార్పొరేషన్/ గంగాధర, అక్టోబర్ 1 : మైత్రి గ్రూప్స్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా మిత్రమండలి సభ్యులు, ఆయన అభిమానులు మంగళవారం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ దవాఖానలో భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జ్యోతినగర్‌లోని మైత్రి టవర్‌లో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. మిత్రమండలి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా చోట్ల మైత్రి ఛానల్ ఎండీ బొల్లినేని సుజన్‌రావు, డైరెక్టర్ ఏనుగు తిరుపతిరెడ్డి, నల్ల శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం రాజిరెడ్డి, వెన్నం రజితారెడ్డి, ఆకెనపల్లి నాగరాజు, సవేరా టీం సభ్యులు, జయపాల్‌రెడ్డి మిత్రమండలి సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

## జనరల్ ఫండ్ నుంచి ఎలా కేటాయిస్తరు?

- రత్నాకర్‌రావు విగ్రహానికి ₹21లక్షలు కేటాయించడం భావ్యమేనా..?
- బల్దియా లోటు బడ్జెట్‌లో ఉంటే ఎలా ఇస్తరు?
- నాకు అభిమానం ఉన్నది.. నా సొంత నిధులు అందిస్తా
- అధికారబలంతో చేసిన కేటాయింపులను రద్దు చేయాలి
- నిధుల కేటాయింపులో వివక్ష వద్దు
- పార్టీలకతీతంగా అభివృద్ధి చేసుకుందాం
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల, అక్టోబర్ 1 : 'కోరుట్ల బల్దియా ₹2 కోట్ల లోటు బడ్జెట్‌లో ఉంది. పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వని పరిస్థితి ఉన్నది. ఇలాంటి సమయంలో పట్టణాభివృద్ధికి వినియోగించాల్సిన జనరల్ ఫండ్ నుంచి మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు విగ్రహ నిర్మాణానికి ₹21 లక్షలు కేటాయించడం భావ్యమేనా?' అని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ప్రశ్నించారు. మాజీ మంత్రిపై తనకు అభిమానం ఉందని, ఆయన విగ్రహ నిర్మాణ తీర్మానానికి సంపూర్ణ మద్దతు ప్రకటించామని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా విగ్రహ నిర్మాణానికి తన సొంత నిధులు అందిస్తానని ప్రకటించారు. కోరుట్ల నియోజవర్గాన్ని పార్టీలకతీతంగా సమష్టిగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికార పార్టీ నాయకులతో కలిసి పని చేసేందుకు వెనుకాడబోనని స్పష్టం చేశారు. కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కోరుట్లలో మున్సిపల్ నిధుల కేటాయింపులో వివక్ష చూపారని, అధికార పార్టీ కౌన్సిలర్ల వార్డులకు మాత్రమే నిధులు కేటాయించి విపక్ష సభ్యుల వార్డులను విస్మరించడం దురదృష్టకరమన్నారు. అధికార బలంతో తీర్మానం చేసిన నిధులు కేటాయింపు అంశాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన మున్సిపల్ నిధులను మౌలిక అవసరాలు, పారిశుద్ధ్య కార్మికుల జీతాలకు వెచ్చించాలని మున్సిపల్ చైర్మన్, అధికారులకు విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో పాటు ఎమ్మెల్యేగా తాను మహనీయుల విగ్రహాల నిర్మాణాలకు సొంత నిధులు సమకూర్చామని గుర్తు చేశారు. రాష్ట్రంలో యథా రాజా.. తథా పాలన అన్నట్టు పాలన కొనసాగుతున్నదని, హామీల అమలు లేదని, నిధులు రాక, పనులు సాగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పది నెలల కాంగ్రెస్ పాలనలో నియోజకవర్గానికి నయా పైసా నిధులు రాలేదని, రైతు బంధు, రైతు భరోసా, మహిళలకు ₹2500 ఫించన్ ఊసేలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో హైడ్రా పేరిట పేద ప్రజల ఇండ్లు కూల్చివేస్తుంటే, కోరుట్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు అక్రమ నిర్మాణాలకు ఊతమిస్తున్నరని, ఇదేం పాలన అని ప్రశ్నించారు. పదిహేనేండ్లుగా ఎంతో ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో శాంతియుత వాతావరణానికి విఘాతం కలిగేలా కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మెట్‌పల్లిలో ఇరుకుగా ఉన్న రహదారిని ఆనుకొని బస్‌షెల్టర్ నిర్మాణానికి ప్రయత్నించడం సరికాదన్నారు. రాజకీయ పరమైన అంశాల్లో విద్యార్థులను భాగస్వాముల్ని చేయడం ఆందోళన కలిగించిందన్నారు. అధికారులు తమ విధులను నిజాయితీతో సక్రమంగా నిర్వర్తించాలని, రాజకీయ నేతల ఒత్తిళ్లకు, బెదిరింపులకు లొంగి వ్యవస్థను భ్రష్టుపట్టించవద్దని హితవు పలికారు. నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మైనార్టీ పట్టణాధ్యక్షుడు ఫహీమ్, మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, కౌన్సిలర్లు ముజాఫర్ అహ్మద్, పోగుల ఉమారాణి, పేర్ల సత్యం, నాయకులు చీటి వెంకట్రావు, బట్టు సునీల్, మురళి, మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అతిక్, సనావొద్దీన్, సురేందర్, అస్లాం పాల్గొన్నారు.

## ఉక్కుపాదంపై ఆగ్రహం

- డిజిటల్ క్రాప్ సర్వే విధానంపై ఏఈవోల ఫైర్
- నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన
- సర్కారు మోయలేని భారం మోపుతున్నదని ఆవేదన
- ఇతర రాష్ట్రాల మాదిరిగా అమలు చేయాలని విజ్ఞప్తి



కథలాపూర్ రైతువేదికలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఏఈవోలు

కరీంనగర్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్) చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఏఈవోలపై ఉక్కుపాదం మోపడంపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది. మోయలేని భారాన్ని వేస్తుండడం, ఒత్తిడి పెంచడం, చర్యలకు దిగుతుండడంపై ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ పరిస్థితుల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు నిరసన బాటపట్టారు. అందులో భాగంగా ఏఈవోల ఐకాస పిలుపు మేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ప్రభుత్వం తమ విషయంలో అనుసరిస్తున్న విధానాలపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే తమపై అధిక పనిభారం, ఒత్తిడి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయకుండా డిజిటల్ క్రాప్‌సర్వే విధానంతో మరింత భారాన్ని మోపుతుందని, దీనిపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా అమలు చేసే ఆలోచన చేయాలని కోరారు. ఒక్కో క్లస్టర్‌లో ఏఈవో 5 నుంచి 8 గ్రామాల పరిధిలోని 600 నుంచి 1000 ఎకరాల వరకు సర్వే చేయాల్సి ఉంటుందని, ఇది కష్టతరమైన పని ఆవేదన చెందుతున్నారు. ఈ సర్వే కోసం గ్రామ స్థాయిలో సహాయకులను నియమించాలని రాష్ట్ర వ్యవసాయ సంచాలకులను కోరినా ఇప్పటి వరకు స్పందించలేదని వాపోతున్నారు. పరిష్కార మార్గం చూపకుండా డీసీఎస్ సర్వే కోసం తమపై ఒత్తిడి తేవడం సరికాదన్నారు.




## చేతగాకే డైవర్షన్ రాజకీయాలు

- హైడ్రా బాధితులకు అండగా ఉంటాం
- బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

మానకొండూర్, అక్టోబర్ 1: 'ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రజలకు ఆచరణ సాధ్యం కాని అనేక హామీలు ఇచ్చింది. గెలిచాక మొండి చేయిచూపింది. ఆ హామీలను అమల్లోకి తేవడం చేతగాకే ప్రజల దృష్టిని మరల్చేందుకు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నది' అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు మండిపడ్డారు. మంగళవారం మానకొండూర్‌లోని గడిమహల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. రెండురోజుల కింద మానకొండూర్ అభివృద్ధి పనుల పేరిట పర్యటించిన మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ కేవలం కేటీఆర్, హరీశ్‌రావును తిట్టడానికే ఇక్కడకు వచ్చినట్టు ఉందన్నారు. హైడ్రా విషయంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు మొసలి కన్నీరు కారుస్తున్నారని సీతక్క ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులే మొసలి కన్నీరు కారుస్తూ ప్రజలను మభ్యపెట్టి మోసపూరిత వాగ్దానాలు, అమలుకానీ హామీలతో అధికారంలో వచ్చారని దుయ్యబట్టారు. బఫర్‌జోన్‌లో అక్రమ కట్టడాలను కూల్చడానికి తీసుకువచ్చిన హైడ్రా జీవోను మొదట స్వాగతించింది ప్రతిపక్ష బీఆర్ఎస్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు మాత్రమేనని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ సర్కారు హైడ్రాను వాడుకొని తప్పుల మీద తప్పులు చేస్తున్నదని, నిరుపేద ప్రజల ఉసురు తీసి ధనవంతులకు కొమ్ము కాస్తున్నదని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు వచ్చి తమ గోడు వినిపిస్తున్న హైడ్రా బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, వారి పక్షాన బరాబర్ కాంగ్రెస్ సర్కారుతో కొట్లాడుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మంత్రులు బీఆర్ఎస్ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మంత్రి కొండ సురేఖపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కానీ, అనవసరంగా బీఆర్ఎస్ పార్టీ, నాయకులను బద్నాం చేయవద్దని మంత్రి ప్రభాకర్‌కు హితవు పలికారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, నాయకులు రామంచ గోపాల్‌రెడ్డి, శాతరాజు యాదగిరి, పిట్టల మధు, ఎస్‌డీ ఖలీల్ మొహియొద్దీన్, దండబోయిన శేఖర్, రాచకట్ల వెంకటస్వామి, పిండి సందీప్, కొట్టె రఘు, నెల్లి శంకర్, బొల్లం అనిల్ ఉన్నారు.

